JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 12-08-2026
Medchal - Malkajgiri । Wednesday 12-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 72
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 72 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# సంగారెడ్డి జిల్లాలో మృత్యుఘోష

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకే రోజు 9 మంది బలి.!

రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ప్రమాదాలు జరుగకుండా ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రతి రోజు జరుగుతూనే ఉన్నాయి. అతివేగం, ఓవర్‌టెక్, మద్యం తాగి వాహనాలు నడపడం ఇలా రకరకాల కారణాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో ఎందరో అమాయకులు బలయవుతున్నారు.

**జయభేరి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను ఢీకొన్న ట్యాంకర్ ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమం ఉండటంతో క్షతగాత్రుల్ని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదం మొగడంపల్లి మండలం సత్వార్ దగ్గర చోటు చేసుకుంది. మృతులు కర్నాటకలోని రాజగిరి వాసులుగా గుర్తించారు పోలీసులు. అయితే ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. అయితే మృతులు అంతా కూలీలుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో 14 మంది కూలీలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి రోజు ఇలాంటి రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ప్రమాదాలు జరుగకుండా ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రతి రోజు జరుగుతూనే ఉన్నాయి. అతివేగం, ఓవర్‌టెక్, మద్యం తాగి వాహనాలు నడపడం ఇలా రకరకాల కారణాల వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో ఎందరో అమాయకులు బలయవుతున్నారు. అలాగే మరో రోడ్డు ప్రమాదం కూడా చోటు చేసుకుంది. కోహీర్ మండలం కవేలిలో వాహనాలపై ఓ కారు దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. బీదర్ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇలా వేర్వేరు ప్రమాదంలో మొత్తం 9 మంది మృతి చెందారు. దీంతో సంగారెడ్డి జిల్లాలో రహదారులు రక్తసిక్తంగా మారాయి.

## హైదరాబాద్ మెట్రోలో భారీ మార్పులు

# పాతబస్తీ మెట్రోకు టెండర్లు షురూ..!



2 లో

- పెరుగుతున్న రద్దీ.. అదనపు కోచ్‌లు కొనుగోలు..!
- ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోండి... సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు!
- డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశలో కీలకమైన పాతబస్తీ మెట్రో కారిడార్ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మెట్రో విస్తరణ పనులతో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌ల కొనుగోలు, భూసేకరణ, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మంగళవారం (ఆగస్టు 11) హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రో కారిడార్ నిర్మించాల్సి ఉంది. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో మెట్రో నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను కూడా ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని స్పష్టం చేశారు. మెట్రో విస్తరణకు అవసరమైన చోట్ల పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్డు విస్తరణ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియలన్నింటినీ సమన్వయం చేసుకుని పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాతబస్తీ కారిడార్ నిర్మాణానికి సంబంధించి ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విషయంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (DMRC) నుంచి అవసరమైన సాంకేతిక సలహాలు తీసుకోవాలని సీఎం సూచించారు. నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ ప్రాంతానికి మెట్రో రైలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలోనూ ఈ కారిడార్ కీలకంగా మారనుంది. హైదరాబాద్ మెట్రోలో రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. మెట్రో రైళ్లకు అదనపు బోగీలు జత చేయాలని, ఇందుకోసం అవసరమైన కొత్త మెట్రో కోచ్‌ల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఖేలో ఇండియాకు ప్రభుత్వ ఆతిథ్యం

- తెలంగాణ ప్రభుత్వం ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ఏర్పాట్లు
- అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధం



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ ఖేలో ఇండియా పోటీలకు సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ లోని స్టేడియంల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు సంబంధించిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను భాగస్వాములను చేసేందుకు ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు,

...మిగతాది 2 లో



## ఎల్ నినో సంక్షోభంలోనూ

# సానుకూల వృద్ధి

- 2025–26 రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు నమోదు
- వ్యవసాయంలో 13.5, పరిశ్రమల్లో 10.6, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి
- ప్రతీ ప్రభుత్వ శాఖ లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ
- 15 శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర ప్రణాళికలు
- సామాన్యుడిపై ధరల భారం లేకుండా కార్యాచరణ
- జీఎస్డీపీ, నెలవారీ ఆర్థిక నివేదికపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2026 జూలై నెల ఆర్థిక నివేదిక ముఖ్యమంత్రికి అందించిన ప్రణాళికా విభాగం

**జయభేరి, అమరావతి, ఆగస్టు 11:**

ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలకడైన వృద్ధి నమోదు చేస్తోందని జూలై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది. గడచిన రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటు కంటే ఏపీ వృద్ధిరేటు మెరుగ్గా నమోదు అవుతోంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం నమోదు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9.9 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదు అవుతున్నట్టు నెలవారీ ఆర్థిక నివేదిక పేర్కొంది. ఈమేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు 2026 జూలై ఆర్థిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. పారిశ్రామిక రంగం 10.6 శాతం మేర, సేవా రంగం 9.9 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాయి. పశుసంవర్ధక శాఖలో మాంసం ఉత్పత్తి 9.6 శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1 శాతం వృద్ధిని సాధించాయి. సేవా రంగంలో ఐటి, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ఎగుమతుల్లో రూ. 16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదు అయ్యింది. ఎస్‌టిపిఐ (STPI) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి, అలాగే వాణిజ్య వాహనాల నమోదు 51.6 శాతం వృద్ధిని కనబరిచింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెక్నాలజీ ఇంటిగ్రేషనుతో

...మిగతాది 2 లో

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం

- ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం
- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం



2 లో

**జయభేరి, న్యూఢిల్లీ:**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

## టెండర్లు షురూ..!

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పీక్ అవర్స్‌లో రద్దీని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి తెలిపారు. మరోవైపు డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.
తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సమ్మిట్‌కు ఆహ్వానించాలని సూచించారు. వ్యాపార రంగంలోని వివిధ విభాగాల్లో విశేష గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అలాగే, గత ఏడాది నిర్వహించిన సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, జరిగిన పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడులను మరింత పెంచేందుకు కొత్త ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. పాతబస్తీ మెట్రో పనులకు టెండర్లు, భూసేకరణను వేగవంతం చేయడంతో పాటు ప్రస్తుత మెట్రో రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు కోచ్‌ల కొనుగోలుకు సీఎం ఆదేశాలు ఇవ్వడంతో హైదరాబాద్ మెట్రో విస్తరణలో కీలక ముందడుగు పడినట్లైంది.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం

'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ''ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం'' అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## ఎల్ నినో సంక్షోభంలోనూ.. వృద్ధి

జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబులు గ్రౌండింగ్ తో 75.4 శాతం మేర, రూ. 60 వేల కోట్ల మేర ఎంఎస్ఎంఈ రంగ పెట్టుబడులు 73.6 వృద్ధిని నమోదు చేశాయి. పన్ను, పన్నేతర ఆదాయాల్లో గణనీయంగా వృద్ధి నమోదు అయ్యింది. ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

**ఎల్ నినో సంక్షోభంలో లక్ష్యాల్ని సాధించాలి**

ఎల్ నినో లాంటి సంక్షోభ సమయంలోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికా విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ టెక్నాలజీని సమర్థంగా అనుసంధానించి లక్ష్యాలను చేరుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం ఉందని కృష్ణా నదిలో ప్రవాహాలు లేని కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా నిండలేదని.. గోదావరికి వచ్చిన వరద ప్రవాహాలను మళ్లించి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని సీఎం పేర్కొన్నారు.
భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని.. ఈ నేపథ్యంలో స్థూల ఉత్పత్తి పడిపోకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వశాఖ అత్యున్నత స్థాయి లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు. నిర్దుష్టమైన ప్రమాణాలను అనుసరించి ఫలితాలు వచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రూపొందించే ప్రతీ ప్రణాళికా రాష్ట్ర వృద్ధిరేటును పెంచేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూడాలని దీనిపై ఓ కమిటీ వేయాలని సూచించారు.
నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు లాంటి అంశాలపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఏపీ 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి కావాల్సిన ఉత్పత్తులపై ప్రభావం లేకుండా చూడాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలవారీగా నివేదికలు ఇస్తే లక్ష్యాల సాధన సులువు అవుతుందని సీఎం సూచించారు. ఈ సమీక్షకు ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు హాజరయ్యారు.

## ఖేలో ఇండియాకు ప్రభుత్వ ఆతిథ్యం

తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్‌తో పాటు జాతీయ స్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా 20 రకాల స్పోర్ట్స్‌కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో, క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణా రావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG) చైర్మన్ శివ సేన రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజాన్, SATG ఎండీ ఎ. సోనీబాల దేవి పాల్గొన్నారు.

## రాయదుర్గంలో డ్రగ్స్ పట్టివేత

జయభేరి, హైదరాబాద్ :

ఎస్‌ఓటీ నార్సింగి టీమ్, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా కలిసి చేసిన ఆపరేషన్ లో మధురానగర్ లోని పోచమ్మ ఆలయం సమీపం లో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. బిహార్ కు చెందిన 23 ఏళ్ల కృష్ణ కుమార్ ను అదుపులోకి తీసుకోని 2.8 కిలోల ఎండు గంజాయి మరియు 6 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు.
స్వాధీనం చేసుకున్న గంజాయి, హెరాయిన్ విలువ సుమారు రెండున్నర లక్షలు గా తెలిపారు. కృష్ణ కుమార్ హౌస్కీపింగ్ సూపర్వైజర్ గా పనిచేస్తు డ్రగ్స్ దందా నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కృష్ణ కుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన బిహార్కు చెందిన కార్మికులు రోషన్, అభిషేక్ కుమార్లను సైతం పోలీసులు అదుపులోకు తీసుకుననారు. రోషన్, అభిషేక్ లకు యూరిన్ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ప్రధాన నిందితులు బంటి కుమార్, అమర్ కుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో వున్న ఇద్దరినీ నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసులు, ఎన్డీపీఎస్ యాక్టు క్రింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఖరీఫ్ కోలుకుంది.. మరి రబీ



ఎల్‌నినో బలపడుతోంది.. జూన్‌లో వర్షాలు దారుణంగా పడిపోయాయి.. ఖరీఫ్ సాగు గతేడాదితో పోలిస్తే భారీగా వెనుకబడింది. దీంతో ఈ ఏడాది పంటల దిగుబడిపై ఆందోళన మొదలైంది. కానీ జూలైలో పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది. నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా పుంజుకోవడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సాగు లోటు బాగా తగ్గింది.. ముఖ్యంగా రబీ పంటలపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఆందోళన కలిగిస్తోంది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రారంభం వ్యవసాయ రంగానికి నిరాశ కలిగించింది. ఎల్‌నినో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను మాత్రమే మార్చదు. వాతావరణంలోని గాలి, పీడన వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే ఈ ప్రభావం వెంటనే కనిపించదు. సాధారణంగా ఒకటి నుంచి రెండు నెలల ఆలస్యం ఉండొచ్చు. అందువల్ల జూలైలో వర్షాలు బాగా పడ్డాయని ఎల్‌నినో ప్రభావం ముగిసిపోయిందని భావించడం తప్పు. రుతుపవనాలపై దాని ప్రతికూల ప్రభావం ముందుముందు కనిపించే అవకాశం ఉంది.ఎల్‌నినో బలపడితే ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రబీ సీజన్ పంటలపై ప్రభావం పడొచ్చు. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, బంగాళాదుంప వంటి పంటలకు తక్కువ వ్యవధి ఉండే వేడి శీతాకాలం అనుకూలం కాదు. అంటే ఈ ఏడాది ఖరీఫ్ పంటలు అనుకున్నంత దెబ్బ తినకపోయినా.. రబీ సీజన్‌లో అసలు సవాలు ఎదురయ్యే అవకాశం ఉంది.వ్యవసాయానికి వాతావరణ ముప్పుతో పాటు ప్రపంచ మార్కెట్లలో ఆహార ధరల పరిస్థితి కూడా భారత్‌కు సవాలుగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఆహార ధరల సూచీ జూలైలో 131.1 పాయింట్లకు చేరింది. ఇది జూన్‌తో పోలిస్తే పెరుగుదల మాత్రమే కాదు.. మూడున్నరేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన సూచీ. అయితే ఈ పెరుగుదలలో ప్రధాన పాత్ర పోషించింది వంటనూనెల ధరలు. జూలైలో ఎఫ్ఏఓ వెజిటబుల్ ఆయిల్స్ ఇండెక్స్ ఏడాది ప్రాతిపదికన 17.3 శాతం పెరిగింది. 2022 జూన్ తర్వాత ఇదే అత్యధిక స్థాయి.అంతర్జాతీయంగా పెట్రోలియం ధరలు పెరిగితే.. పామాయిల్, రేప్‌సీడ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్ వంటి వంటనూనెలను బయోఫ్యూయల్ తయారీలో ఉపయోగించేందుకు ప్రోత్సాహం పెరుగుతుంది. దీంతో ఆహార అవసరాలకు అందుబాటులో ఉండే నూనెలపై ఒత్తిడి పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. జూన్‌లో దేశవ్యాప్తంగా సాధారణ దీర్ఘకాల సగటు వర్షపాతం (ఎల్‌పీఏ) కంటే 38 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయి. సాధారణంగా జూన్‌లో సుమారు మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడి వర్షాలను తీసుకొస్తాయి. అవి సగటున 11 రోజుల పాటు ప్రభావం చూపుతాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో ఒక్క అల్పపీడన వ్యవస్థ కూడా ఏర్పడలేదు. దీంతో 1901 తర్వాత దేశంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన జూన్ నెలల్లో ఇది ఆరో స్థానంలో నిలిచింది. ఇంతటి లోటు వర్షపాతం నమోదైన సమయంలో ఎల్‌నినో ఇంకా బలహీనమోస్తరు దశలోనే ఉండటం గమనార్హం.వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు కూడా మందగించింది. జూలై 6 నాటికి దేశంలో ఖరీఫ్ పంటలు కేవలం 350.85 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 442.80 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అంటే సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే 20.8 శాతం తక్కువగా ఉంది. నూనెగింజల విషయంలో లోటు మరింత ఎక్కువగా ఉండగా.. పప్పుధాన్యాల్లో 21.8 శాతం, పత్తిలో 23 శాతం వరకు సాగు తగ్గింది. నూనెగింజలు, పప్పుధాన్యాలు, పత్తి వంటి పంటల విషయంలో సాగు తగ్గితే దేశీయ ఉత్పత్తిపై ప్రభావం పడటంతో పాటు దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి పెరుగుతుంది.ఎల్‌నినో జూలైలో బలహీనమోస్తరు స్థాయి నుంచి మోస్తరుబలమైన స్థాయికి చేరినా.. నైరుతి రుతుపవనాలు మాత్రం బలంగా పుంజుకున్నాయి. జూలైలో సాధారణంగా మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడాల్సి ఉండగా.. ఈసారి నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. అంతేకాదు.. ఇవి నెమ్మదిగా కదలడంతో ఎక్కువ కాలం వర్షాలను కురిపించాయి. సాధారణంగా అల్పపీడన వ్యవస్థల ప్రభావం సుమారు 14 రోజులు ఉండగా.. జూలైలో ఇది దాదాపు 24 రోజులకు చేరింది. దీంతో జూలైలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 2.4 శాతం ఎక్కువగా నమోదైంది. ఇది భారత వాతావరణ విభాగం అంచనాలకు కూడా భిన్నంగా ఉండటం విశేషం. జూలైలో వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.జూలై చివరి నాటికి దేశంలో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 894.22 లక్షల హెక్టార్లకు చేరింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు సాగు విస్తీర్ణం కేవలం 2.9 శాతం మాత్రమే తక్కువగా ఉంది. అంటే జూన్‌లో 20.8 శాతంగా ఉన్న సాగు లోటు.. జూలై చివరికి కేవలం 2.9 శాతానికి తగ్గిపోయింది. పప్పుధాన్యాల్లో సాగు లోటు 6.3 శాతానికి, పత్తిలో 2.4 శాతానికి తగ్గింది. నూనెగింజల సాగు మాత్రం గతేడాది స్థాయిని కూడా అధిగమించింది. ముఖ్యంగా వేరుశనగ, నువ్వుల సాగు మెరుగుపడింది.జూలై మూడో, నాలుగో వారాల్లో కురిసిన వర్షాలు ఇప్పటికే విత్తిన పంటలకు కూడా ఊపిరి పోశాయని మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన ప్రముఖ పప్పుల మిల్లర్ నితిన్ కలంత్రికి తెలిపారు. వర్షాల లోటుతో తేమ ఒత్తిడిని ఎదుర్కొంటున్న పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపశమనం కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ఈ వర్షాలు లేకపోతే మొక్కల్లో వేర్లు, కాండం, ఆకుల పెరుగుదల వంటి వృక్ష దశ అభివృద్ధి దెబ్బతినేదని వివరించారు.సోయాబీన్ పంట పరిస్థితి కూడా మెరుగుపడింది.ఖరీఫ్ పంటలకు ఆగస్టు, సెప్టెంబర్ తొలి వారాల్లో కూడా వర్షాలు అవసరం. ఈ దశలో పంటలు పూత దశకు, గింజలు లేదా కాయలు ఏర్పడే దశకు చేరుకుంటాయి. ఈ సమయంలో తగినంత తేమ లేకపోతే చివరికి దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఐఎండీ ప్రకారం ఆగస్టు 13 ప్రాంతంలో ఉత్తర బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్‌బంగ్లాదేశ్ తీర ప్రాంతాలను ఆనుకుని మరో అల్పపీడన వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది.అక్టోబర్‌డిసెంబర్ మధ్య ఎల్‌నినో చాలా బలమైన దశకు చేరే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అంతేకాదు.. 2027 మార్చి వరకు శీతాకాలం, వసంతకాలంలో కూడా ఎల్‌నినో పరిస్థితులు కొనసాగవచ్చని అంచనా. ఇది భారత వ్యవసాయానికి రెండు రకాల ముప్పులను తెచ్చే అవకాశం ఉంది.



## ఎస్‌ఐఆర్‌లో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా బీఆర్ఎస్ పోరాటం

- 74 లక్షల ఓట్లు అన్‌కలెక్టబుల్‌గా ఉండటం ఆందోళనకరం
- ముసాయిదా ఓటరు జాబితా తర్వాత జిల్లాల వారీగా సమావేశాలు
- న్యాయపరంగా, పార్టీ పరంగా అర్హుల ఓట్ల పరిరక్షణకు కార్యాచరణ

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ భవన్‌లో పార్టీ ఎస్ఐఆర్ కమిటీతో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలు, అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగించకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3 కోట్ల 39 లక్షల ఓట్లు ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. అందులో దాదాపు 73 నుంచి 74 లక్షల ఓట్లు 'అన్‌కలెక్టబుల్'గా ఉన్నాయని, వాటి నుంచి ఇప్పటివరకు స్పందన రాలేదని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారం చెబుతోందన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లు అన్‌కలెక్టబుల్‌గా ఉండటం, వాటిలో చాలా ఓట్లు తొలగించబడే అవకాశం ఉందనే పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. అదేవిధంగా సుమారు 60 లక్షల ఓట్లలో అనామలీస్ ఉన్నట్లు సమాచారం ఉందని కేటీఆర్ తెలిపారు. మొత్తంగా చూస్తే ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే నాటికి కేవలం సుమారు రెండు కోట్ల ఓట్లు మాత్రమే ఎలాంటి సమస్యలు లేకుండా మిగిలే పరిస్థితి కనిపిస్తోందని, మిగిలిన ఓట్లలో కొన్ని తొలగిపోయే అవకాశం ఉండగా, మరికొన్నింటిలో తప్పులు, అనుమానాలు ఉన్నట్లు ఎన్నికల కమిషన్ నుంచి సమాచారం వస్తోందన్నారు. అర్హులైన ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని ఎన్నికల అధికారులు చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఆ జాబితా ప్రచురణ అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇప్పటికే పార్టీ లీగల్ సెల్‌తో సమావేశమై, న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకున్నామని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయినట్లయితే వారికి న్యాయం చేయడానికి ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి, పార్టీ పరంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, బాధిత ఓటర్లకు అండగా పార్టీ యంత్రాంగాన్ని ఏ విధంగా క్రియాశీలం చేయాలనే అంశాలపై న్యాయ నిపుణులతో చర్చించామని కేటీఆర్ చెప్పారు. ఆగస్టు 13, 14 తేదీల్లో కొన్ని సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నామని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో చర్చించిన అనంతరం ఆ సమావేశాల పూర్తి వివరాలు, కార్యాచరణను వెల్లడిస్తామని తెలిపారు. జిల్లాల వారీగా జరిగే సమావేశాల్లో స్థానిక పరిస్థితులను సమీక్షించి, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజంగా అర్హులైన కొంతమంది ఓటర్ల పేర్లు కూడా తొలగించబడుతున్నట్లు కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా న్యాయపరంగా, పార్టీ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో పూర్తిగా అప్రమత్తం చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతి పెద్ద పరిశోధన కేంద్రం



జయభేరి, హైదరాబాద్ :

గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌవరమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యత నిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకాలు

■ శ్రీవారి సేవలో ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు

జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 11:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో కొలువైన శ్రీఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మంగళవారం ఆంజనేయుడిని సింధూరంతో అలంకరించి స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా మంగళవారం రూ.16,16,870 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.61,874, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,21,800, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,60,550, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,45,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.36,316, ప్రసాద విక్రయం ద్వారా రూ.6,17,400, కల్యాణ కట్ట ద్వారా రూ.24,200తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**శ్రీవారి సేవలో ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బత్తిని, హైదరాబాద్ చీఫ్ కమిషనర్ సునీత బిల్లలు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.



# యాదాద్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పిస్తా..

■ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 11 :

యాదాద్రి ఆలయంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భద్రత కల్పిస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పరిధిలోని పాతగుట్టలో ఔట్ సోర్సింగ్ సిబ్బందితో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలియజేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను పరిష్కరించి, ఉద్యోగుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. యాదాద్రి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను బోర్డు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభించి, 15 రోజుల వ్యవధిలో సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పిఏసీఎస్ ఛైర్మన్ చీర శ్రీశైలం, మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ బూడిద మధు, సాధునేని ధనలక్ష్మి మధుకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, గంధమల్ల అశోక్, యాదాద్రి కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కైరంకొండ అనిల్ కుమార్, జనరల్ సెక్రటరీ ఆకనూరి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా పనిచేయాలి

■ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలకు బీర్ల అయిలయ్య సూచన

జయభేరి, యాదగిరిగుట్ట :



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సూచించారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పథకం కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం వేళల్లో సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, చేయూత పథకం ద్వారా నూతన పెన్షన్లకు అర్హులైన వారి దరఖాస్తులను స్వీకరించేందుకు సహకరించాలన్నారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఇతర లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట యాదగిరిగుట్ట పిఏసీఎస్ ఛైర్మన్ చీర శ్రీశైలం, మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, కౌన్సిలర్లు బూడిద మధు, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, కాట బత్తిని స్వప్న, కోఆప్షన్ సభ్యులు గౌళికార్ అరుణ, రహీమా, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# నేడు ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని ఆయా మండలాలలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 930 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అలాగే 11 గంటలకు వనపర్తి జిల్లా కలెక్టరేట్ లో ఐడిసి (ఇరిగేషన్ డెవలప్మెంట్ బోర్డ్) సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు చిన్నచింతకుంట మండలం నెల్లికొండి గ్రామంలో నూతన చర్చ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. కావున ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, ఐ ఎన్ టి యు సి, సేవదళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# నేడు దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి వేడుకలు

■ మహబూబ్ నగర్ లో ముమ్మరంగా ఏర్పాట్లు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు, దివంగత ఎర్ర సత్యం 31 వ వర్ధంతి వేడుకలను నిర్వహించనున్నారు ప్రతి ఏడాది జిల్లా కేంద్రంలో దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి వేడుకలను జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి వేడుకలను నిర్వహించనున్నారు. దీనికిగాను జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎర్ర సత్యం చౌరస్తా వద్ద దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం విగ్రహానికి రంగులు వేసి అలంకరించారు. ఈ కార్యక్రమానికి దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం అభిమానులు, అధిక సంఖ్యలో తరలి రావాలని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కోరారు.

# అభివృద్ధి కోసం కలిసి సాగుదాం అని పిలుపు

■ కాంగ్రెస్ పార్టీలోకి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆహ్వానం

జయభేరి, దేవరకద్ర :



బిజెపి, బిఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మంగళవారం పిలుపునిచ్చారు. దేవరకద్ర నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ పెరుగుతుందన్నారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే జిఎంఆర్ కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలు, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, పార్టీలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబంలోకి వచ్చే ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతు న్నామన్నారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగుదాం అన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుశతుందన్నారు. ఆ నినాదంతో దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు.

# రూ.10, రూ.20 పాలిమర్ నోట్లు

జయభేరి, ముంబై, ఆగస్టు11 :



దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం 1934'లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. అందువల్ల, వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు, దీనికి ఎంత ఖర్చవుతుంది అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

■ దేవరకద్ర ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

దేవరకద్ర నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల ఆశయాలు నెరవేరుద్దామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి కోరారు. చిన్నచింతకుంట మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామాభివృద్ధే, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు పార్టీ పటిష్టతకు ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు నూతన కమిటీ ఏర్పాటు విషయంలో గ్రామ పార్టీ నాయకులతో కలిసి భాస్కర్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలకు భాస్కర్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు భాస్కర్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నచింతకుంట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఎం.మధుసూదన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



జయభేరి, దేవరకద్ర :

జోగులాంబ గద్వాల జిల్లా; బీజేపీ కార్యాలయంలో మంగళవారం రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ డోకూరు పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి. రామాంజనేయులు, జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్, కె.కె. రెడ్డి, గద్వాల అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఇంకా బూత్ నుండి పార్టీని బలోపేతం చేయడం, భారీ మెజారిటీతో గెలిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

# భారీగా పెరిగిన మరణాలు..

■ 69 మంది మృతి

జయభేరి, కొలంబియా :

కొలంబియాలో సంభవించిన భారీ భూకంపం ధాటికి 69 మందికి పైగా చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. భవన శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయారని తెలుస్తోంది. దీంతో మరణాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. 7.4 తీవ్రతతో ప్రకంపనలు రావడంతో చాలా భవనాలు కుప్పకూలిపోయాయి. భవనాలు పేకమేడల్లా ఊగుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.



## అంబేద్కర్ కాలనీ వద్ద బస్సులు ఆపాలి

- బీజేపీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు కాలనీవాసుల వినతి

**జయభేరి, మేడ్చల్:**

లాల్‌గాడి మలక్‌పేట్ అంబేద్కర్ కాలనీ వద్ద ఆర్టీసీ బస్సులు నిలపాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాలనీవాసులు హకీంపేట్ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కైరా గణేష్ మాట్లాడుతూ గత జూలై 20న అంబేద్కర్ కాలనీ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలపడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయమై మరోసారి అంబేద్కర్ కాలనీవాసులతో కలిసి కౌన్సిలర్ గణేష్ డిపో మేనేజర్‌ను కలిసి సమస్యను వివరించారు. కాలనీ వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేకాకుండా కొందరు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో దురుసుగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలనీవాసుల సమస్యలను విన్న డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ ఇకపై అంబేద్కర్ కాలనీ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించే డ్రైవర్లు, కండక్టర్లపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న జర్నలిస్టు కుటుంబాలకు అండగా సర్పంచుల ఫోరం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 11 :**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన సాక్షి జర్నలిస్టు దుగ్యాల రవికుమార్ మరణించడంతో ఆయన కుటుంబానికి 40 వేల రూపాయలు, ప్రజాతంత్ర జర్నలిస్టు ముత్రాజుపల్లి చంద్రం ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచులు సోమోల వెంకటేష్, బొత్త రాములు, ధూప్ సింగ్ నాయక్, రాజారాం నాయక్, సీతరాజు, సుధాకర్ నాయక్, సంతోష్ రెడ్డి, గుండా సిద్ధులు, సతీష్ కుమార్, సోన్నాయిల రఘు, రజిని సురేందర్ నాయక్, కర్రే మాధవి కరుణాకర్ గౌడ్, జేరుపోతుల కరుణాకర్, డొంకన రేణుక వెంకటేష్, పాంగల పవనిత బాలకృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్లు గుగులోతు హనుమంతు నాయక్, పల్లె పహాడ్ ఉపసర్పంచ్, తదితరులు పాల్గొన్నారు



## ర్యాపిడో పేరుతో కొత్త మోసం




**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు11 :**

హైదరాబాద్‌లోని చారిత్రక చార్మినార్ సమీపంలో ఓ యువతి పట్ల నకిలీ రాపిడో డ్రైవర్ అనుమానాస్పదంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. రాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న యువతిని లక్ష్యంగా చేసుకున్న ఆగంతకుడి బండారాన్ని ఆమె తన సమయస్ఫూర్తితో బయటపెట్టింది. ఈ ఘటన ప్రయాణికుల భద్రతపై మరోసారి చర్చను రేకెత్తించింది.కంటెంట్ క్రియేటర్ సిద్ధేశ్వరి సుగంత్ రాత్రి 9 గంటల సమయంలో చార్మినార్ వద్ద ఆటో కోసం వేచి చూస్తోంది. అదే సమయంలో స్కూటర్‌పై వచ్చిన ఓ వ్యక్తి, "ఎక్కడికి వెళ్లాలి? రాపిడో కావాలా మేడమ్?" అని అడిగాడు. అయితే, అతడి స్కూటర్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడం, అతడి వద్ద డ్రైవర్ ఐడీ కార్డు కూడా లేకపోవడాన్ని సిద్ధేశ్వరి గమనించింది.సందేహం రావడంతో ఐడీ కార్డు చూపించాలని ఆమె గట్టిగా నిలదీసింది. దీంతో కంగారుపడిన ఆ వ్యక్తి, ఆమె ముందే ప్లే స్టోర్ నుంచి రాపిడో యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం మొదలుపెట్టాడు. దీంతో అతడు నకిలీ డ్రైవర్ అని ఆమెకు స్పష్టంగా అర్థమైంది. వాహనం స్టార్ట్ కావడం లేదంటూ అతడు మాట దాటవేసే ప్రయత్నం చేశాడు. దీంతో అతడి ఫోన్‌ను పరిశీలించగా యాప్ అప్పుడే లాగిన్ అవుతూ ఓటీపీ పేజీలో ఉంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె "మర్యాదగా ఇక్కడి నుంచి వెళ్లిపో" అని గట్టిగా హెచ్చరించింది.ఎలాంటి బుకింగ్, వెరిఫికేషన్ లేకుండా ఇంత ధైర్యంగా ఒక వ్యక్తి బైక్ ఎక్కమనడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని సిద్ధేశ్వరి సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వీడియోను పంచుకోవడం ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేయడమే తన ఉద్దేశమని తెలిపింది.ఈ ఘటనపై స్పందించిన రాపిడో సంస్థ, సిద్ధేశ్వరి అప్రమత్తతను ప్రశంసించింది. యాప్‌లో రైడ్ బుక్ చేయకుండా నేరుగా వచ్చి డ్రైవర్లమని చెప్పే వారిని నమ్మవద్దని వినియోగదారులకు సూచించింది. రైడ్ ఎక్కే ముందు యాప్‌లో డ్రైవర్ ఐడీ, వాహనం నంబర్, ఓటీపీ వంటి వివరాలను కచ్చితంగా సరిచూసుకోవాలని స్పష్టం చేసింది.

# సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ వద్దు

- జీవో 641ను వెంటనే రద్దు చేయాలి
- డంపింగ్ యార్డ్‌తో ప్రజారోగ్యం , పర్యావరణానికి తీవ్ర ముప్పు
- జీవో రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుంది
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 11 :**

రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జేఏసీ ఆధ్వర్యంలో కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే చెత్త నుంచి వెలువడే దుర్వాసన, దుమ్ము, పొగతో పాటు హానికర వాయువుల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. చెత్తలోని వ్యర్థాలు భూమిలోకి, భూగర్భ జలాల్లోకి చేరితే నీటి కాలుష్యం ఏర్పడి తాగునీరు, వ్యవసాయ భూములు కలుషితమయ్యే






ప్రమాదం ఉందన్నారు. డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వంటి వ్యాధి కారకాలు పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే భూసారం దెబ్బతినడం, పంటలపై ప్రతికూల ప్రభావం పడటం, పరిసరాల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయని అన్నారు. గ్రామాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఆ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదని అంజయ్య యాదవ్ అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కంటే ఏ అభివృద్ధి కార్యక్రమం ముఖ్యమైనది కాదని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో పౌర హక్కుల సంఘాల నాయకులు, జేఏసీ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, సిద్ధాపూర్ పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ జీవోను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. జీవో నంబర్ 641ను రద్దు చేసే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందని, అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు.

# ఘనంగా బోనాల వేడుకలు

- ప్రజలంతా ఐకమత్యంతో పండుగ జరుపుకోవాలి: కౌన్సిలర్ శాంతి రాజు నాయక్

**జయభేరి, మేడ్చల్ :**



ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రాజ బొల్లారం తండా వార్డులో మంగళవారం శ్రీ ఎల్లమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ మలోత్ శాంతి రాజు నాయక్ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఎలాంటి గొడవలు, విభేదాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా పండుగను జరుపుకునేలా 4వ వార్డు కౌన్సిలర్ శాంతి రాజు నాయక్ ప్రత్యేకంగా కృషి చేశారు. అనంతరం కౌన్సిలర్ శాంతి రాజు నాయక్ మాట్లాడుతూ శ్రీ ఎల్లమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఎలాంటి గొడవలు, విభేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని కోరుకుంటున్నాఅని, గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనేలా నిరంతరం కృషి చేస్తానాని ఈ పేర్కొన్నారు. అమ్మవార్ల ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకునట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# వృద్ధాప్య పింఛన్లు ఇవ్వని ప్రభుత్వం గద్దె దిగాలి

- అర్హులైన వృద్ధులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలి
- సోనగంటి గోవర్ధనాచారి, తీదేడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు


**జయభేరి, చింతపల్లి :**



అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని తీదేడు గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి అన్నారు. వృద్ధులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గ్రామాల్లో ఎంతోమంది వృద్ధులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని, వయస్సు మీదపడిన వారికి పింఛన్ ఎంతో ఆసరాగా ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి వృద్ధుడికి ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.వృద్ధులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవాలని అన్నారు. పింఛన్ల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి,మర్రు రామారావు,ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, జూలూరు శ్రీధర్, దాసరి ముత్తయ్య, రెడ్డి పరమేష్, మునగాల అశోక్,పంబాల చంద్రయ్య,కలగోని కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండలంలో పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

**జయభేరి, పరవాడ:**




ఏపీ ఈపీడీసీఎల్ జేఎన్పిసి, ఈపి బోనంగి సెక్షన్ల పరిధిలో బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

పరవాడ 11 కె.వి ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్, కండక్టర్ రీప్లేస్మెంట్, విద్యుత్తు మెయింటినెన్స్ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పరవాడ, బీసీ కాలనీ,న్యూ కాలనీ, సినిమా హాల్ జంక్షన్, ఎస్టిబిఎల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని తెలిపారు.

అలాగే ధర్మారాయుడుపేట, వాడ చీపురుపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్తు నిర్వహణ పనుల్లో భాగంగా డిఆర్ పేట, జల్లెలపాలెం, శృంగారపాడు,బొట్టవానిపాలెం,మోటూరువానిపాలెం,గొల్లగుంట,రావాడ,కొత్తవెన్నెలపాలెం,రేకవానిపాలెం,వాడచీపురుపల్లి,ముత్యాలమ్మపాలెం,తిక్కవానిపాలెం,నాయుడుపాలెం, దోసూరు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. పైన తెలిపిన ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈ ఈ మురళీకృష్ణ కోరారు.



## కొత్త పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

- అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి: రామన్నగారి రాఘవేందర్‌గౌడ్

**జయభేరి, మేడ్చల్:**

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో నేటి నుంచి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకం కింద కొత్త పింఛన్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక భద్రత ప్రతి ఒక్కరి హక్కు అనే ఉద్దేశంతో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన కుటుంబాలకు పింఛన్ ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాఘవేందర్ గౌడ్ సూచించారు. మేడ్చల్ డివిజన్ పరిధిలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఈత కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితరులతో పాటు ఫైలేరియా, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న అర్హులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పింఛన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ పొందని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అర్హతకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలని రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుపేద కుటుంబాలకు చెందిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాఘవేందర్‌గౌడ్ కోరారు.

## 65 అంతస్థులతో ట్రాంప్ టవర్లు




**జయభేరి, హైదరాబాద్ :**


నగరంలోని కోకాపేటలో ట్రంప్ టవర్స్ నిర్మించనున్నారు. 65 అంతస్తులతో రెండు టవర్ల నిర్మాణం జరగనుంది. ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు సంయుక్తంగా వీటి నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నాయి. ఈ టవర్లలో అతి ఖరీదైన 450 ఫ్లాట్లు ఉండనున్నాయి. ట్రంప్ టవర్స్కు ఇప్పటికే రెరా అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి త్వరలో జరిగే భూమి పూజకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. మూడేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్న ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు వెల్లడించాయి.

# 3 కోట్ల 36 లక్షలు ఓట్ల డిజిలైటేషన్ పూర్తి

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు11:

తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ భారీ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. సేకరించిన సమాచారంలో ఇప్పటి వరకు దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ పూర్తి చేయగా, నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. అయితే ఈ నమోదు సరళిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ఓటర్ల జాబితా స్వరూపమే మారిపోనుందని స్పష్టమవుతోంది.మరోవైపు, క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులకు సవాలుగా మారిన అనేక అంశాలు వెలుగుచూశాయి. మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను (21.70 శాతం) వివిధ కారణాల వల్ల సేకరించలేకపోయినట్లు అధికారులు 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించగా, 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు నమోదైంది. మరో 11.25 లక్షల మంది అసలు జాడ తేలక అడ్రస్ దొరకని స్థితిలో ఉండగా, 6.70 లక్షల మందికిపైగా ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ భారీ వ్యత్యాసాలు, వలసల గణాంకాల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఊహించని పెద్ద మార్పులు చోటుచేసుకోనున్నాయి.

రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, సోమవారం సాయంత్ర నాటికి కేవలం 2,64,73,616 మంది (78.26 శాతం) వివరాలు మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయ్యాయి. మిగిలిన 73,52,832 మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ లెవెల్ ఆఫీసర్లకు సమర్పించలేదు. లేదా వారు అందుబాటులో లేరు. ఈ ఓటర్లను అధికారులు ఏఎస్‌డీ(ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెడ్) జాబితాలో చేర్చారు.ముఖ్యంగా ఇప్పుడు గల్లంతైన ఓట్లలో అన్‌కలెక్టబుల్ జాబితాలో ఎక్కువ ఉన్నాయి. తర్వాత స్థానంలో నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా వల వెళ్లినట్టు గుర్తించారు. మిగతావి డూప్లికేట్ ఓట్లు అంటే ఒకే వ్యక్తికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉన్నట్టు తేలింది. ఓటరు జాబితాను పారదర్శకంగా మార్చటానికి కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రక్షాళన చేపట్టింది. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించినప్పుడు చాలా మంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం లేదా ఆధారాలు చూపకపోవడం వల్ల వారి పేర్లు గల్లంతవుతున్నాయి.మరో కీలక అంశం అంటే, గతంలో మ్యాపింగ్ సర్వే నిర్వహించినప్పుడు సుమారు 89 లక్షల ఓట్లలో 11 రకాల తేడాలను గుర్తించారు. వీటిని సవరించిన తర్వాత కూడా ఇప్పటికే యాభై లక్షలకుపైగా ఓట్లలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఓటర్లను కూడా ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.



### ప్రభావం ఎక్కువ ఎక్కడ ఉంది?

ఈ ఓట్ల గల్లంతు ప్రభావం గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా ఉంది. ఇక్కడ దాదాపు అరవై శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యింది. అంటే దాదాపు 20 లక్షల ఓట్లు ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్లాయి. మేడ్చల్‌మల్కాజగిరిలో 70 శాతం డిజిటలైజేషన్ జరిగింది. రంగారెడ్డిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే అత్యధికంగా 95 శాతం డిజిటలైజేషన్‌తో అగ్రస్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో 92 శాతంతో జనగామా, 91 శాతంతో మెదక్, సూర్యాపేట ఉన్నాయి.

### ఎప్పుడు ఏం జరుగుతుంది?

ఓటర్లు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి ఇంకా సమయం ఉంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. అక్టోబర్ 15 లోపు వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తారు. అక్టోబర్ 19న తుది జాబితా విడుదల చేస్తారు.

### ఓటును ఎలా కాపాడుకోవాలి?

ఒక వేళ మీ పేరు ముసాయిదా జాబితాలో లేకపోయినా, లేదా ఏఎస్‌డీ జాబితాలో ఉన్నా ఆందోళన చెందాల్సిన పని లేదు. ఆగస్టు 17 తర్వాత ఈపోర్టల్ లేదా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌లో మీ పేరు ఉందో లేదో సరిచూసుకోండి. ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి సమర్పించాలి. ఒక వేళ పేరు తొలగించినట్టు అయితే, ఫారం 6 ద్వారా కొత్తగా మోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వలేదనే కారణంతో నేరుగా ఓటు తొలగించు. అధికారులు నోటీసులు ఇచ్చి, విచారణ చేసిన తర్వాతే తుది



# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ విజయవంతంగా ముగియడంలో BLAల కృషి అభినందనీయం

- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

జయభేరి, దేవరకొండ :

ఎస్.ఐ.ఆర్. (SIR) ప్రక్రియ విజయవంతంగా ముగియడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు) అందించిన సేవలు, చూపిన నిబద్ధత అభినందనీయమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు అనర్హులైన ఓటర్లను గుర్తించే ప్రక్రియలో BLAలు చూపిన నిబద్ధత, పట్టుదల, బాధ్యత ప్రశంసనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులు, అనర్హుల వివరాలను గుర్తించడం వంటి ప్రక్రియలో BLAలు కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల వద్దకు వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ప్రతి BLAకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.

# జాతీయగ్రామీణ ఉపాధి హామీపథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

- ఉపాధి హామీ కార్మిక సంఘం సిఐటియు మండల గౌరవ అధ్యక్షులుగని శెట్టి డిమాండ్

జయభేరి, పరవాడ:

పరవాడ వి బిజీ రాంజీ పథకం పేరుతో ఉపాధి హామీ కార్మికుల పొట్ట కొట్టదని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దని ఉపాధి హామీ కార్మిక సంఘం సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో రావాడ పంచాయతీ ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ విబిజీ రాంజీ పథకంలో కార్మికులకు ముఖ ఆధారిత హాజరు వలన అనేక మంది కార్మికులు హాజరు సక్రమంగా పడక ఇంటి ముఖం పట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తట్టకీ , పారకి , గుణపాంకి, రవాణా చార్జీలు చెల్లింపులు ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయం అన్నారు.




ప్రతి 15 రోజులకి వేతనాలు చెల్లిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం నెలలు గడుస్తున్న వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. ఆలస్యానికి వడ్డీ చెల్లిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల వేతనాలు కి వడ్డీ కట్టి చెల్లిస్తారా అని గని శెట్టి ప్రశ్నించారు. ప్రతి 15 రోజులకి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న 4 వారాల వేతనాలు చెల్లించాలన్నారు. బీమా సౌకర్యం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ పథకంలో బీమా గురించి ప్రస్తావించలేదని దీనివల్ల కార్మికులు గాయపడ్డ, చనిపోయిన కార్మికులకు భీమా చెల్లించే అవకాశం లేకుండా పోయిందని దీనివల్ల కార్మిక కుటుంబాలు రోడ్డున పడేపరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకి 700 రూపాయలు వేతనం చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, భారతి, బేగం, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యండి

- బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారం యాత్ర

జయభేరి, పరవాడ:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాల్లో భాగంగా పరవాడ మండలం దేశపాత్రునిపాలెం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ప్రచార యాత్ర ను సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు జెండా ఊపి ప్రారంభించారు అనకాపల్లి జిల్లా సీపీఐ కార్యదర్శి రాజాన దొరబాబు ప్రచార యాత్ర ప్రారంభించారు. దేశపాత్రునిపాలెం నుంచి ప్రారంభమైన ర్యాలీ పరవాడ గ్రామం, తానం గ్రామం మీదుగా తాడి గ్రామానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రచారం నిర్వహిస్తూ లంకెల పాలెం జంక్షన్ వరకు సాగింది. అనంతరం లంకెలపాలెం జంక్షన్‌లో ప్రచార యాత్ర ముగిసింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పెరుగుతున్న భారాలను తగ్గించడంలో




విఫలమైందని విమర్శించారు. ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, సార్వత్రిక విద్యావైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమాలను ప్రజలు, కార్మికులు, రైతులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున ఆదరించాలని, సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ బైక్ ర్యాలీలో అనకాపల్లి జిల్లా సీపీఐ కార్యదర్శి రాజాన దొరబాబు , అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు బూసి పరమేశ్వరి,సీపీఐ పరవాడ మండల కార్యదర్శి కండేపల్లి త్రినాథ్, మండల సమితి సభ్యులు లక్ష్మీ, ప్రియాంక, మణికంఠ పాటు సీపీఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు

- చలివాగు నీటిని విడుదల చేయాలి, పంటలను ఆదుకోవాలి, రైతులను కాపాడుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

జయభేరి, రేగొండ :

రేగొండ మండలం, చెన్నపూర్ x రోడ్డు జాతీయ రహదారి పై రైతులు చలివాగు ప్రాజెక్ట్ నుండి నీటిని విడుదల చేయాలని చేస్తున్న రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్ని, రైతులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి వారితో పాటు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు. అనంతరం శాయంపేట మండలం, జోగంపల్లి గ్రామంలోని చలివాగు ప్రాజెక్ట్ మరియు పంపుహౌస్ లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలివాగు ప్రాజెక్ట్ తూములు లేపి నీళ్లు వదిలి, ఆయకట్టు ప్రాంత పంట పొలాలకు నీళ్లు ఇయ్యాలని చెప్పి, దాదాపుగా మేము 15, 20 రోజుల నుంచి అడుగుతున్న ఈ ప్రభుత్వానికి చలనం లేదు. చీమ కుట్టినట్టు కూడా అయితలేదు.

ఇక్కడి నుంచి మోటార్ల వేసి పైకి నీళ్లు తీసుకుపోతున్నారు, మా పంట పొలాలకు నీళ్లు ఇస్తలేరు కాబట్టి మా రైతులందరూ కూడా ఈరోజు తీవ్రమైనట్టువంటి మనోవేదనలో ఉన్నారు.

రైతన్నలు నార్లు పోసి 45 రోజులు అయ్యింది, నార్లు పెరిగి ఉన్నాయి.నీళ్లు ఇస్తే నాటేసుకోవాలి. కానీ ఈ ప్రభుత్వం నీళ్లు ఇవ్వకుండా మీనవేషాలు లెక్కిస్తున్నారు కాబట్టి ఈరోజు చివరిగా ప్రభుత్వానికి హెచ్చరిక చేయడం కొరకు ఈరోజు రాస్తారోకో చేశాం.ఇది ఇంతటితో ఆగదు. తక్షణమే గనక స్థానిక శాసన సభ్యుడు 24 గంటల లోపు నీళ్లు గనక వదలకపోతే, ఎమ్మెల్యే గ్రామాలకు వస్తే నిలదీస్తాం, ఎక్కడికక్కడ నడవకుండా చేస్తాం అని ఈరోజు రైతులు హెచ్చరిక చేస్తున్నారు కాబట్టి, వాళ్ళ డిమాండ్ ప్రకారం తక్షణమే నీళ్లు ఇయ్యాలి, పంట పొలాలకు నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

ఈరోజు ప్రభుత్వం ద్వంద విధానాలు అవలంబిస్తున్నది. స్టేషన్ ఘన్పూర్ నియోజక వర్గానికి వారు అక్కడ రైతులకు అఫీషియల్‌గా పంటలు ఇస్తారు, ఇక్కడనేమో మా రైతుల పంట పొలాలు ఎండగోడుతున్నారు, ఇది ఏం ధర్మం, ఇది ఏమి న్యాయం అని చెప్పి రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈరోజు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే,ఖచ్చితంగా 9 పంపులను ఆన్ చేయాలి,9 పంపులు నడిపియ్యాలి,పంట పొలాలకు నీళ్లు ఇయ్యాలి,అందరికీ నీళ్లు ఇయ్యాలి అని కోరుకుంటున్నాం.

మేము రైతులం మా పంట పొలాలు పండాలే,పక్కోలది కూడా పండాలని కోరుకుంట్టాం. కానీ ప్రస్తుతం 5 లేదా 6 పంపులు మాత్రమే నడుస్తున్నాయి, ఎందుకు అంటే రిపేర్ అని ఒకసారి, ఎలక్ట్రిసిటీ ప్రాబ్లం అని కారణాలు చెప్తున్నారు. 9 పంపులు నడిస్తే నెలకు 6 టీఎంసిల నీళ్లు పంపింగ్ అవుతాయి అంటే 6 నెలలకు 36 టీఎంసిలు నీళ్ళు పంపింగు జరిగితే గనక ఎక్కడ కూడా పంట పొలం ఎండదు, తాగునీటి సమస్య రాదు. కాబట్టి ఇవన్నీ కూడా చేయాలని చెప్పి ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం.చేయకపోతే ఇయ్యాల ఈ ఒక్క రాస్తారోకో తో ఆగదు. ఈ కార్యక్రమం రేపు ఉంటది, ఎల్లుండి ఉంటది.

ఖచ్చితంగా ఈ ప్రభుత్వం దిగి వచ్చే వరకు మా కార్యక్రమం ఉంటది. రైతులను ఏడిపించిన పాలకులు కాలగర్భంలో కలిసిపోయారు. రైతు ఏడిచిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన ముందు పడదు. ఇప్పటికే రైతులు ఏడుస్తున్నారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని ఏద్దేవా చేశారు అని చెప్పి రైతులు గగ్గోలు పెడుతున్నారు. రేవంత్ రెడ్డి నువ్వు ఏదో కొంగ జపం చేసినట్టు, ఇప్పుడు ఏదో వాన కావాలని యాగాలు చేస్తే వానలు పడవు. గోదావరి పోతుంటే చూస్తున్నావ్, కృష్ణా ప్రవహిస్తుంటే చూస్తున్నావ్, పంట పొలాలు ఎండిపోతుంటే చూస్తున్నావ్. ఇకనైన ఇప్పటికైనా ప్రభుత్వం మరి సరియైనటువంటి విధానాలు అవలంబించి, పంపులు ఆన్ చేయాలి అని డిమాండ్ చేశారు.



# మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

- రామంతాపూర్ డివిజన్‌పై జోనల్ కమిషనర్ రాధిక గుప్తతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

రామంతాపూర్ డివిజన్‌లో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభం కాకుండా పెండింగ్‌లో ఉండటంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తను కలిసి రామంతాపూర్ డివిజన్‌లో మంజూరైన పనుల వివరాలను ఎమ్మెల్యే చర్చించారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మంజూరైన పనులను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన నూతన అభివృద్ధి పనులకు కూడా అవసరమైన నిధులు కేటాయించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. రామంతాపూర్ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి అంశాలపై OSDని కలిసిన ఎమ్మెల్యే



జయభేరి, ఉప్పల్ :

ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) కింద జారీ అయ్యే LOCలకు సంబంధించిన అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి CM OSD వేముల శ్రీనివాస్ ని కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం అవసరమైన CMRF-LOCల మంజూరు, దరఖాస్తులు, సంబంధిత సమస్యలపై ఎమ్మెల్యే OSD వేముల శ్రీనివాస్ తో చర్చించారు. అర్హులైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు వైద్యపరంగా ఇబ్బందులు కలగకుండా CMRF-LOC ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్‌తో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్చ



జయభేరి, ఉప్పల్ :

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు తదితర అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ని కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న అంశాలపై కలెక్టర్ తో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం సచివాలయంలో సంబంధిత అధికారులతో కూడా ఇందిరమ్మ ఇళ్ల అంశంపై చర్చించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.

# కాలనీ లోనీ ఓపెన్ స్పేస్ లో పార్కు.. ఓపెన్ జిమ్ ని ఏర్పాటు చేయిస్తా...

- శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

బీరప్ప గడ్డ డివిజన్లోని హైకోర్టు కాలనీలోని ఓపెన్ స్పేస్ లో పార్క్ ని, ఓపెన్ జిమ్ ప్లే ఎక్విప్మెంట్ ని ఏర్పాటు చేయాలని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, హైకోర్టు కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి జోనల్ కమిషనర్ రాధిక గుప్తాని వారి కార్యాలయంలో కలవడం జరిగింది. అనంతరం శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ కి హైకోర్టు కాలనీలోని 4 వేల గజాలో HMDA వాళ్లు పెట్టిన నర్సరీ ని తొలగించి హైకోర్టు కాలనీ అసోసియేషన్ సభ్యులకు నూతన పార్క్ ని ప్లే ఎక్విప్మెంట్ మరియు ఓపెన్ జిమ్ ని ఏర్పాటు చేయాలని వారిని కోరడం జరిగింది. అదేవిధంగా హైకోర్టు కాలనీలోని బాగా దెబ్బతిన్న సిసి రోడ్లను, స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్, సెంట్రల్ మీడియకు కలర్స్ వేయించాలని వారిని కోరడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, హైకోర్టు కాలనీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజ్, అసోసియేషన్ సభ్యులు గోపాల్ దాస్, సుధీర్ కుమార్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ ఫ్యూమ్ మొదలగు వారు పాల్గొన్నారు.

# హీరోయిన్ కన్నీళ్లు..



దక్షిణాదిలో వైవిధ్యమైన పాత్రలు.. విభిన్న కథలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ దుషారా విజయన్. 2019లో బోధై ఏరి బుద్ధి మారి అనే తమిళ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన ఆమె ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంది. దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కించిన సార్పట్ట పరంపర సినిమాతో ఆమెకు బ్రేక్ వచ్చింది. తనకు ఛాన్స్ వస్తే తెలుగులోనూ నటించేందుకు రెడీగా ఉన్నట్లు వెల్లడించింది. తన సోదరుడితో ఆమెకున్న అనుబంధం ప్రత్యేకమైనది. "నేను, తమ్ముడు ఒక సెవెన్ ఇయర్స్ చెన్నైలో ఒంటరిగా ఉన్నాము. సో ఐ యామ్ హిజ్ మదర్, టెక్నికల్లీ... హి ఇస్ మై చైల్డ్. సో, నాకు మా తమ్ముడే అన్నీ" అని దుషారా తెలిపారు. వారిద్దరి మధ్య బలమైన అనుబంధం ఉందని, ఏ విషయాన్నైనా తమ్ముడితో పంచుకోగలనని ఆమె అన్నారు. ఏదైనా జరిగితే, తన తమ్ముడు ముందుగా తనకు ఫోన్ చేసి చెబుతాడని, ఇది వారిద్దరి మధ్య ఉన్న అవగాహనను తెలియజేస్తుందని దుషారా పేర్కొన్నారు. అంతేకాకుండా, తన దివంగత సోదరి గురించి దుషారా భావోద్వేగంగా పంచుకున్నారు. తనకు ముగ్గురు సోదరీమణులు ఉండేవారని, తన రెండో అక్క పదేళ్ల క్రితం కన్నుమూశారని తెలిపారు. ఆమె మయోపతి అనే ఆరోగ్య సమస్యతో బాధపడ్డారని చెప్పారు. తనకి డ్యాన్స్ పట్ల ఆసక్తి కలగడానికి ప్రధాన కారణం తన సోదరి అని దుషారా వెల్లడించారు. "వాళ్ళు నడవలేరు... బట్ షి వాజ్ బోర్న్ లైక్ దట్" అని నాగార్జున ఊపిరి సినిమాలో పాత్రను పోలి ఉండే ఆమె పరిస్థితిని వివరించారు. తన సోదరి వీల్ చైర్‌లో కూర్చుని "దుషీ ఇలా ఆడు, అలా ఆడు" అని తనకు సలహాలు ఇచ్చేవారని, ఆ విధంగానే తనకు డ్యాన్స్ పై ప్రేమ కలిగిందని దుషారా తెలిపారు. తన సోదరిని కోల్పోయినప్పటికీ, ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ తనతో ఉంటాయని, ఇప్పటికీ ఇంటి నుండి బయలుదేరేటప్పుడు ఆమె ఫోటోస్ ముందు ప్రార్థిస్తానని భావోద్వేగంగా చెప్పారు.



## మానవబంధాలపై తీసిన గొప్ప సినిమా


'తెలుగువారితో నాది 28ఏండ్ల బంధం. వారిని దృష్టిలో పెట్టుకొనే ఈసినిమా చేశాను. మానవబంధాలపై తీసిన గొప్ప సినిమా ఇది. నా కెరీర్‌లోనే ఇది ప్రత్యేకం. 'గజినీ' నాటి ఎనర్జీని మళ్లీ ఈ సినిమాలో చూస్తారు. సిన్సియర్ డైరెక్టర్ వెంకీ అట్లూరి. ముఖ్యంగా తను గొప్ప రచయిత. అద్భుతమైన పాత్రలను సృష్టించారు. నిర్మాతలు ఓ అందమైన ప్రపంచాన్నే ఆవిష్కరించారు. టీమ్ అంతా ప్రేమతో పనిచేశారు. 'సూర్య సన్నాఫ్ కృష్ణన్'ని తెలుగు ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకున్నారు. అలాగే ఈ 'విశ్వనాథ్ అండ్ సన్స్'ని కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని అగ్ర నటుడు సూర్య అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన పాన్ ఇండియా ఫ్యామిలీ డ్రామా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితాబైజు కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో సూర్య మాట్లాడారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ 'నమ్మకంగా చెబుతున్నా. ఈ సినిమా చూస్తున్నంతసేపూ ఆడియన్ ముఖంపై చిన్న చిరునవ్వు కచ్చితంగా ఉంటుంది. సినిమా ఇంతబాగా రావడానికి పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. 20ఏండ్లుగా సూర్యసార్ సినిమాలు చూస్తూ ఎదిగాను. ఇప్పుడు ఆయనతో సినిమా చేశాను. ఇది నేను ఓ ఫ్యాన్ బోయ్‌గా చేసిన సినిమా' అని చెప్పారు. 'సూర్యసార్‌తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అద్భుతమైన టీమ్‌తో పనిచేసే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు' అన్నారు కథానాయిక మమితాబైజు. ఇంకా చిత్ర నిర్మాతలతోపాటు రాధిక శరత్‌కుమార్, కె.ఎల్.నారాయణ, మైత్రి రవిశంకర్, శాసనసభ్యులు నవీన్ యాదవ్, రామజోగయ్యశాస్త్రి, సునీల్‌రెడ్డి, బీవీఎస్ఎన్ రవి, విజయ్ బిన్నీ, హైపర్ ఆది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అల్లరి నరేష్ 'రంభ ఊర్వశి మేనక' టీజర్ విడుదల..




టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన నలుగురు కథానాయికలు రాశిసింగ్, విష్ణు ప్రియా, సురభి, ప్రిషా సింగ్ నటిస్తున్నారు. తన వంశ పారంపర్యంగా వచ్చిన కోరికల బుక్‌తో భూమి మీదకి రంభ, ఊర్వశి, మేనకలను పిలిచిన అనంతరం జరిగిన పరిణామాలు ఏంటి అనేది ఈ సినిమా స్టోరీ. ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమా పూర్తిగా వినోదాత్మక నేపథ్యంలో రూపొందుతోంది. విడుదలైన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తూ, అల్లరి నరేష్ మార్క్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని స్పష్టం చేస్తోంది. ఈ చిత్రం సెప్టెంబర్ 04న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## టాక్సిక్ సినిమా బడ్జెట్.. కియారాకు ఎన్ని కోట్ల పారితోషికమంటే..




మోస్ట్ అవైటెడ్ చిత్రాల్లో టాక్సిక్ ఒకటి. రాకింగ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీపై ముందు నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. పోస్టర్స్, టీజర్, గ్లింప్స్ ద్వారా సినిమాపై హైప్ క్రియేట్ చేసిన మేకర్స్..ఈ సినిమా విషయంలో ప్రేక్షకులలో ఏదోక క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నారు. నిజానికి ఎప్పుడో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా పలుమార్లు వాయిదా పడగా.. ఇప్పుడు ఎట్టకేలకు ఆగస్ట్ 26న థియేటర్లలో విడుదల కానుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇటీవల ట్రైలర్ రిలీజ్ చేయగా.. ఫుల్ బోల్డ్ అండ్ వయొలెంట్ గా ఉంది. ఇందులో యశ్, నయనతార, కియారా అద్వానీ పాత్రలు మరింత హైలెట్ కానున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ట్రైలర్ ద్వారానే సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయ్యింది. ఇక ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు ఆడియన్స్. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ ఇప్పుడు ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ఇందులో యశ్ తోపాటు కియారా అద్వానీ, నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా కీలకపాత్రలు పోషిస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ మూవీ బడ్జెట్.. అలాగే ఒక్కొక్కరు ఎంత పారితోషికం తీసుకున్నారనే విషయం నెట్టింట చర్చకు దారితీసింది. భారీ తారాగణంతో రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని భారీ దాదాపు రూ.500 నుంచి రూ.600 కోట్లతో నిర్మిస్తున్నట్లు సమాచారం. ఇక ఇందులో నటీనటులకే సమీదాదాపు రూ.150కోట్లకు పైగా ఖర్చు చేస్తుందట చిత్రయూనిట్. ఈ సినిమా కోసం యశ్ దాదాపు రూ.50 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నాడట. అలాగే హీరోయిన్ కియారా అద్వానీకి రూ.15 కోట్లకు పైగా చెల్లిస్తున్నట్లు టాక్. అలాగే లేడీ సూపర్ స్టార్ నయనతార రూ.12 కోట్లు నుంచి రూ.18 కోట్లు తీసుకుంటున్నారట. ఇక వీరితోపాటు రుక్మిణి వసంత్ రూ.5 కోట్ల వరకు పారితోషికం అందుకుంటుందట. అలాగే బాలీవుడ్ భామలు తారా సుతారియా రూ.3 కోట్లు తీసుకుంటుందట. ఈ లెక్కన కేవలం తారల పారితోషికం కోసమే రూ.150 కోట్ల వరకు రెమ్యునరేషన్ కోసం ఖర్చు చేస్తున్నారట. ఎట్టకేలకు ఇప్పుడు ఈ మూవీ ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా అడియన్స్ ముందుకు రానుంది.

## వాళ్లంతా నన్ను అందుకే దూరం పెట్టారు..



సోషల్ మీడియాలో తన పోస్టుల గురించి, దానివల్ల ఇంట్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే ప్రశ్నకు వర్ష సమాధానమిస్తూ, తన కుటుంబ సభ్యులు ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్ చూడరని తెలిపారు. అయితే, బంధువులు లేదా ఇతరులు చూసి అనుకోవచ్చు అని అంగీకరించారు. తాను చేసే పనులు కొంతమందికి సహాయపడతాయని కుటుంబానికి తెలుసని వర్ష వివరించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చే డబ్బును కొంతమందికి సహాయం చేయడానికి ఉపయోగిస్తున్నానని, అంతేకాకుండా ప్రతి పేటా, ప్రతి నెలా తన కుటుంబం కూడా కొంతమందికి సహాయం చేస్తుందని ఆమె తెలిపారు. డబ్బుల కోసమే కాకుండా, తనకి కొన్ని ఫ్యాషన్స్, ఇష్టాలు, సరదాలు కూడా ఉన్నాయని వర్ష స్పష్టం చేశారు. ఇప్పటివరకు తన కుటుంబ సభ్యులు తన పోస్టుల గురించి తనతో ఎప్పుడూ మాట్లాడలేదని ఆమె చెప్పారు. ఈ సందర్భంలో, యూట్యూబ్ స్పైక్స్ టీమ్ నుండి ఒకరు వర్ష మంచి మనసున్న వ్యక్తి అని, మధ్యాహ్నం మంచి ఫుడ్ తెప్పించేదని పటాస్ ప్రవీణ్ చెప్పుకొచ్చారు. అలాగే, ఆమెపై ఎన్నో ట్రోలింగ్‌లు చేసి ఆడుకున్నా, ఆమె వాటిని స్వీకరించే వ్యక్తిత్వం గొప్పదని, అందుకే ఈ మంచి పొజిషన్‌లో ఉన్నారని తెలిపారు. దీనిపై వర్ష స్పందిస్తూ, ఈ రోజు తాను ఈ స్థాయిలో ఉన్నానంటే దాని వెనుక చాలా కష్టం, బాధ ఉందని, తనను ఈ స్టేజ్‌లో నిలబెట్టినవారు, ఆదరించినవారు అందరూ బాగుండాలని కోరుకుంటున్నానని తెలిపారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**